నవతెలంగాణ
ఆదిలాబాద్
గురువారం | అక్టోబర్ 17, 2024 | www.navatelangana.com

19న కుమురంభీం విగ్రహ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఉట్నూర్



ఈ నెల 19న మండలంలోని తాటిగూడలో కుమురంభీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంద్రా జైవంతరావు అన్నారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లోని డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలిలను మర్యాదపూర్వకంగా కలిసి విగ్రహావిష్క కార్యక్రమానికి హాజరుకావాలని అహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాటి గూడ గ్రామ ప్రజలు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-నిర్మల్ రూరల్



వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. చైర్మన్‌గా సోమ భూమారెడ్డి, వైస్ చైర్మన్‌గా ఈటెల శ్రీనివాస్, డైరెక్టర్‌లతో వ్యవసాయశాఖ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. దీనికి నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్ హాజరయ్యారు. మున్సిపల్ చైర్మన్ నూతన మార్కెట్ చైర్మన్, పాలకవర్గ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తుందన్నారు. నూతన పాలక మండలిని పలువురు ఘనంగా సన్మానించారు.

సోయా పంట చోరి ఇద్దరు అరెస్ట్

నవతెలంగాణ-తాంసి

పంట చేనులో ఆరబెట్టిన సోయా పంటను దొంగతనం చేసిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు తాంసి ఎస్సై శివరాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బండల్ నాగపూర్ గ్రామానికి చెందిన రైతు ఏల్మ రాజారెడ్డి తన పంట చేనులో సోయా పంటను ఆరబెట్టుకున్నాడు. రెండు రోజుల క్రితం మూడు క్వింటాళ్ళ సోయా పంట చోరీ అయినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు అదే గ్రామానికి చెందిన పూర్ణచందర్, కృష్ణ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలి

- డీఐఈఓ రవీందర్ కుమార్



నవతెలంగాణ-నార్నూర్

ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈఓ సి.రవీందర్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకుల రిజిస్టర్‌ను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. కళాశాలలో చదివే గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచి పోటీ పరీక్షలలో రాణించేలా తయారు చేయాలన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ మోసిన్, మురళీ, కళాశాల ప్రిన్సిపాల్ కేశవులు, అధ్యాపకులు ఉదయ్ కుమార్, బాలాజీ, వెంకటరమణ, సుజాత, డి.సుజాత, పుష్ప, జ్వాలేందర్, గజానంద్, కృష్ణవేణి, రుక్మిణి ఉన్నారు.

బెల్టు షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో బెల్ట్ షాపులు గల్లిగల్లి, గ్రామ గ్రామాన మంచినీళ్ళ కుళాయిల లాగా వెలుస్తున్నాయని వీటిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాలలో వార్డులలో కొందరు రాజకీయ నాయకులకు లేదా గ్రామస్తులకు టెండర్లలో డబ్బులు ఇచ్చి గ్రామ అభివృద్ధి కమిటీ పేరు చెప్పి ఇలా రూ.లక్షలు కోట్లు సంపాదించేందుకు కొందరు మహారాష్ట్ర నుండి దేశీ దారు తీసుకువచ్చి ఇందులో కలిపి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఎక్సైజ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండల రాములు, అరుణ్ కుమార్, దళిత కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రాందాస్, సీనియర్ నాయకులు షేక్ పాషా, బెజ్జంకి నర్సింగరావు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాలి



నవతెలంగాణ-ఖానాపూర్

గ్రామాల్లో పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి టాక్స్‌లను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని, ట్రెడ్ లైసెన్స్‌లను ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని కవర్లను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డ్రైనేజీలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ప్రజలకు వ్యాధులు రాకుండా, ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మి, మండల పంచాయతీ అధికారి రత్నాకర్ రావు, ఏపీఓ, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పర్యవేక్షణ అధికారులున్నారు.

హీరాసుక్క మందిర నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-నార్నూర్



గాదిగూడ మండల కేంద్రంలో బుధవారం హీరాసుక్క మందిర నిర్మాణానికి మాజీ ఎంపీపీ చంద్రకళ రాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమాజాభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షులు హేరేకుంర పాండురంగ్, ప్రధాన కార్యదర్శి ఆత్రం వామన్, కోశాధికారి గేడం పరశురాం, ప్రచార కార్యదర్శి, సిడాం వామన్, సమాజ పెద్దలు తొడసం శ్యాంరావ్, పర్చకి కిసాన్, మేస్రం గోవింద్ రావ్, కుడ్మేత భరత్, కుమురం గంగారాం, యూత్ కమిటీ సభ్యులు ఆర్క జ్ఞానేశ్వర్, మేస్రం దత్త, మేస్రం వెంకటేష్, మేస్రం శేఖర్ బాబు ఉన్నారు.

సాంకేతిక రంగం అభివృద్ధికి ప్రోత్సాహం

- రాష్ట మంత్రి సీతక్క



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సాంకేతిక రంగం అభివృద్ధికి అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నట్లు రాష్ట పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. బీహెచ్ఈఎల్ సౌజన్యంతో జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంచార సైన్స్ ల్యాబ్ బస్సును కలెక్టర్ వెంకటేష్ ధోత్రేతో పాటు ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న వేల మరింత అభివృద్ధి కోసం అవసరమైన ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. రోజురోజుకు నూతనంగా వెలుగులోకి వస్తున్న టెక్నాలజీని విద్యార్థులు సరైన విధంగా ఉపయోగించుకోవాలన్నారు. సంచార సైన్స్ ల్యాబ్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అంతకు ముందు ఎమ్మెల్యే కోవలక్ష్మీ మాట్లాడుతూ జిల్లాకు రెగ్యులర్ విద్యాధికారిని నియమించాలని, విద్యార్థులకు అల్పాహార పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకుంటానని, జిల్లాకు పూర్తిస్థాయి విద్యాధికారి నియామకం వెంటనే చేపడతామని హామీ ఇచ్చారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ప్రారంభం

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, జిల్లా ఆస్పత్రిలో మహిళ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో పూలతో డీఆర్డీఓ దత్తారం ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. అక్కడే మంత్రి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళ ఆర్థిక సాధికారిత కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.



అంతకు ముందు జిల్లాలో 270 స్వయం సహాయక సంఘాలకు రూ.16 కోట్ల రుణాలను ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా, రూ.రెండు కోట్ల రుణాలను శ్రీనిధి పథకం ద్వారా అందజేశారు.

పీవీటీజీ గ్రామాలలో మెరుగైన వైద్య సేవలు

పీవీటీజీ గ్రామాలలో ప్రజలకు మరింత అందుబాటులో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద మొబైల్ వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి సీతక్క తెలిపారు. జిల్లాలో వైద్య సేవలు అందించే మొబైల్ వాహనాలను బుధవారం ప్రారంభించడం జరిగిందని, పీవీటీజీ గ్రామాలలో ప్రతి ఆవాసానికి మొబైల్ వాహనాల ద్వారా వెళ్లి ప్రజలకు చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. పీవీటీజీల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, సెర్ప్ సిబ్బంది, జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఫలించిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి సంఘాల పోరాటం

- కొత్త ఇన్‌చార్జి వీసీగా గోవర్ధన్ నియామకం

నవతెలంగాణ-ముధోల్

బాసర ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణపై సుదీర్ఘంగా విద్యార్థి సంఘాలు జరిపిన శాంతియుత పోరాటం ఎట్టకేలకు ఫలించింది. ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణను ప్రభుత్వం తొలగించి ఆయన స్థానంలో జేఎన్‌టీయూ ప్రొఫెసర్ గోవర్ధన్ నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు, ఉస్మానియా విద్యార్థి జేఏసీ సంఘ నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. వీసీ వెంకటరమణను తొలగించాలని ట్రిపుల్ ఐటీ విద్యార్థి సంఘ నాయకులు మొదటి నుంచి శాంతియుత పోరాటాన్ని చేశారు. అయినా ప్రభుత్వ పెద్దలతో తనకున్న పరిచయాల వల్ల వీసీ ఇప్పటివరకు తన పదవిని కాపాడుకుంటూ వచ్చారన్న ఆరోపణలు లేకపోలేదు. తాజాగా గత పదిహేను రోజుల క్రితం ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణపై ఉస్మానియా విద్యార్థి జేఏసీ నాయకులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. వీసీ వ్యవహారన్ని ఎమ్మెల్సీ కోదండరాం దృష్టికి తీసుకెళ్లారు. అంతె కాకుండా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు ముధోల్ ప్రాంతానికి చెందిన ఉస్మానియా విద్యార్థి జేఏసీ నాయకుడు సర్దార్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల వినతి పత్రం అందజేశారు. తక్షణం ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ జోడు పదవులను తొలగించి విజిలెన్స్ ఎంక్వయిరీ చేయాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. విద్యార్థి సంఘాల ఒత్తిడి మేరకు డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రత్యేక చొరవ తీసుకొని ట్రిపుల్ ఐటీని గాడిలో పెట్టాలన్న ఉద్దేశంతో వీసీ వెంకటరమణ తొలగించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వీసీని తప్పించారని విద్యార్థి సంఘ నాయకులు పేర్కొంటున్నారు. బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీగా ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ పదవి నుంచి తొలగించారు. ఏది ఏమైనా విద్యార్థుల పోరాటం ఫలించడంపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది.

వీసీని తొలగించటాన్ని స్వాగతిస్తున్నాం

బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వీసీ వెంకటరమణను ప్రభుత్వం తొలగించటాన్ని స్వాగతీస్తున్నామని ట్రిపుల్ ఐటీ తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్ఎఎస్) సంఘం అధ్యక్షుడు ఆకాష్ యాదవ్, ప్రధాన కార్యదర్శ యశ్వంత్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మా సంఘం ఆధ్వర్యంలో శాంతి యుత పోరాటం చేయటం, అందరి సహకారంతో వీసీనీ తొలగించటం జరిగిందని పేర్కొన్నారు. కొత్త వీసీ గోవర్ధన్‌కు అభినందనలు తెలిపారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ట్రిబుల్ ఐటీ అభివృద్ధికి, విద్యార్థులకు మా సంఘం నిరంతరం అండగా ఉంటుందని వారు స్పష్టం చేశారు.

బకాయిలు చెల్లించకపోవడంతోనే కళాశాలలు బంద్

- కలెక్టరేట్ ఎదుట యాజమాన్యాల నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయని కారణంగా కళాశాలలు మూసే పరిస్థితికి వచ్చాయని ఆదిలాబాద్ జిల్లా ప్రయివేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు హన్మండ్లు అన్నారు. ఆర్టీఎఫ్ నిధులు విడుదల చేయాలని మూడు రోజులుగా ప్రయివేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు బంద్ కొనసాగిస్తున్నాయి. ఇందులో భాగంగానే బుధవారం మూడవ రోజు నిరసనలో భాగంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట శాంతియుత ధర్నా నిర్వహించారు. ఇచ్చోడ, ఆదిలాబాద్, బేల, నేరడిగొండ, బోథ్ కళాశాలల నుండి యజమానులు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్టీఎఫ్ నిధులు చెల్లించాలని నినాదాలు చేస్తు ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ఫీజు రియంబర్స్ విడుదల చేయకపోవడంతో ప్రయివేట్ డిగ్రీ కళాశాల పరిస్థితులు చాలా ఘోరంగా ఉన్నాయి. మూడు సంవత్సరాలుగా ఆర్టీఎఫ్ పెండింగ్‌లో ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం టోకెన్స్ ఇస్తుందని కానీ బడ్జెట్ ఇవ్వడం లేదన్నారు. దీని కారణంగా కళాశాల నిర్వహణతో పాటు సిబ్బందికి వేతనాలు చెల్లించలేకపోతున్నామని, ట్యాక్స్, అద్దె ఇతర ఖర్చుల భారం తమపై పడుతుందన్నారు. 8 నెలల నుంచి ఆర్టీఎఫ్ కోసం వేచిచూస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు ఇచ్చేంత వరకు కళాశాలలను మూసి వేసి ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రయివేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యల సంఘం కార్యదర్శి వరప్రసాద్, ప్రతినిధులు పున్నారావు, ప్రభాకర్ రెడ్డి, మహ్మద్ బిలాల్, నికేష్, క్రాంతి, గోపాల్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ప్రభుత్వంపై ఉద్యమించాలి

- పట్టణంలో కార్మికుల ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికులు హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉంటూ ప్రభుత్వంపై ఉద్యమించాలని విశ్రాంత కార్మిక శాఖ అధికారి చిట్యాల జగదీష్ రెడ్డి అన్నారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలనే డిమాండ్‌తో బుధవారం దుకాణాల్లో పనిచేసే కార్మికులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మర్వాడి ధర్మశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఇక్కడి కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందించారు. ముందుగా కార్మికుల సంక్షేమమం కోసం చేపట్టిన బంద్‌లో వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొని దుకాణాలను మూసి ఉంచారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ విశ్రాంత అధికారి చిట్యాల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఏ విధంగా అయితే ప్రభుత్వాలను భయపెట్టి పథకాలను పొందుతున్నారో అదే విధంగా కార్మికులు ఐక్యంగా ఉండి ప్రభుత్వాలను బయపెట్టాలని పిలుపునిచ్చారు. 20 సంవత్సరాల నుంచి ఉన్న సంక్షేమ పథకాలనే ఎలాంటి వ్యత్యాసం లేకుండా కొనసాగిస్తున్నారన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఎలాంటి మార్పు చేయలేదన్నారు. అడగనిదే ప్రభుత్వాలు ఏవి ఇవ్వవని, సంక్షేమమం, హక్కుల కోసం ప్రశ్నించాలన్నారు. ప్రభుత్వాలు కూడా కార్మికుల సంక్షేమమం దిశగా ముందుకు సాగాలన్నారు. కార్మికుల కోసం ప్రభుత్వం ముందుకు వచ్చి ఆదుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్ అన్నారు. తమ దుకాణాల్లో పని చేసే వారిని కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామన్నారు. వారి కోసం తాము చేస్తున్నామని, కానీ ప్రభుత్వం కూడా వారు చేయాల్సి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు రాజేశ్వర్, కార్మికులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై కేసు నమోదు సరికాదు

- బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్



నవతెలంగాణ- ఖానాపూర్

కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు చేయించడం పిరికిపంద చర్యగా ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అభివర్ణించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్‌పై కేసు పెట్టడన్ని తీవ్రంగా ఖండించారు. కేటీఆర్‌కు కేసులు కొత్తేమీ కాదని ఆయన రాజకీయ జీవితమే ఉద్యమంతో మొదలైందన్నారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ నాయకత్వంలో వందల కేసులు ఎదుర్కొని ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర కేటీఆర్‌దన్నారు. కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలను ప్రజలు గ్రహిస్తున్నారు. కేసులు బనాయించడంలో ఉన్న శ్రద్ధ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలపై లేదని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలను బెదిరించే ఉద్దేశంతోనే ఇలాంటి అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కి కేసులు కొత్త కాదని రాబోయే రోజుల్లో తెలంగాణ ఉద్యమం తరహా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమం తప్పదన్నారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు మానుకొని ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులున్నారు.

మిషన్ భగీరథపై శిక్షణ



నవతెలంగాణ-తాంసి

తాగునీటి మిషన్ భగీరథ సరఫరా వాటి నిర్వహణపై మండలంలోని ఆయా గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లకు బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో అధికారులలు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి విడుదల చేస్తామన్నారు. మల్టీపర్పస్ వర్కర్లు గ్రామాల్లో ఎవరికైన నూతన కనెక్షన్ ఇచ్చేటప్పుడు కేవలం భగీరథ సరఫరా చేసిన నల్లాలు పైపులు కప్లింగ్‌లను మాత్రమే బిగించాలన్నారు. ఈ భగీరథ పరికరాలు బిగించడం వల్ల ఎవరైనా విద్యుత్ మోటార్లు పెట్టుకోవడానికి వీలు ఉండదన్నారు. ప్రతి ఒక్కరికి సమానంగా నీటి సరఫరా అవుతుందన్నారు. ఇలాంటి జాగ్రత్తలు ప్రతి గ్రామపంచాయతీ కార్మికుడు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలు నాలుగు రోజుల పాటు విడుతల వారీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు గడ్డం మోహన్ రెడ్డి, గోపాల కృష్ణ రెడ్డి, తహసీల్దార్లు లక్ష్మి, మిషన్ భగీరథ జేఈ చంద్రశేకర్, ఏఈ మహేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు ఉన్నారు.

దస్తురాబాద్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-కడెం

మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలో గర్భిణులు, చిన్నపిల్లల చికిత్స శిబిరాన్ని డాక్టర్ విజయ్ కుమార్ మెడికల్ ఆఫీసర్ పీహెచ్‌సీ దస్తురాబాద్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు ముఖ్యంగా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రతలు, వ్యాయమాలు, ఆరోగ్య సూత్రాల గురించి పలు సూచనలు చేశారు. సాధారణ కాన్పుల వల్ల కలిగే లాభాలను గురించి, సిజేరియన్ కాన్పుల వల్ల కలిగే నష్టాలను గురించి వివరించి. ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ కాన్పుల సంఖ్య పెరగాలంటే ప్రతి గర్భిణి సాధారణ కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెల్లాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ శైలేంద్ర కన్నయ్య, పీహెచ్ఎస్ వరలక్ష్మి, ఎమ్ఎల్ హెచ్ పి రమ్య, ఎల్‌టి రాజేందర్, ఆశాలు విజయ, వనజ, అనసూయ, లక్ష్మి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 16 నుండి 19 వరకు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సట్ల శంకర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 19, 20న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జావీలిన్ త్రోలో జిల్లాకు చెందిన రత్నం వంశీ, ఆలం శైలజ అత్యంత ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొట్నాక విజయ్, కోశాధికారి గుండం లక్ష్మణ్, హెడ్ మాస్టర్ జంగు, కోచ్ విద్యాసాగర్ అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | అక్టోబర్ 17, 2024 | www.navatelangana.com

చౌక ధరల దుకాణం తనిఖీ

నవతెలంగాణ-నార్నూర్



గాదిగూడ మండలంలోని అర్జుని గ్రామంలో గల చౌక ధరల దుకాణానీ జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి వాజీద్ అలీ బుధవారం తనిఖీ చేశారు. యంత్రాన్ని బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని శాటిలైట్ పాఠశాలను లికారి కే అంగన్‌వాడీ కేంద్రాన్ని గాదిగూడ మండల కేంద్రంతో పాటు ధాబా బి, పీప్రి గ్రామంలో దుకాణాన్ని తనిఖీ చేశారు. వారి వెంట ఎన్‌ఫోర్స్ మెంట్ డిటీ మధుసూదన్ ఉన్నారు.

క్యాడెట్లకు డ్రిల్ శిక్షణ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ కళాశాలలో 32 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ పది రోజుల పాటు ఇనిస్టిట్యూషనల్ ట్రైనింగ్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఎన్‌సీసీ పిఐ సిబ్బంది సుర్జిత్ సింగ్, నరేష్ కుమార్ క్యాడెట్లకు డ్రిల్ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతిక్ బేగం, ఎన్‌సీసీ కేర్ టెకర్ చంద్రకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సంబంధాలు పెంచుకోవాలి

- డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించినప్పుడే ప్రజలలో పోలీసుల పట్ల నమ్మకం పెరుగుతుందని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలను పెంచుకోవాలని పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీకి సాయుధ బలగాలతో గౌరవ వందనం చేసిన డీఎస్పీ జీవన్‌రెడ్డి స్వాగతం పలికారు. కార్యాలయ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలో ఉన్న పోలీస్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి సంబంధిత అధికారులకు అప్పగించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహించారని తెలియజేశారు. రాత్రి సమయాలలో అదనంగా గస్తీ నిర్వహిస్తూ ఆర్థిక నేరాలను కట్టడి చేసే విధంగా ప్రణాళికను రూపొందించాలని సూచించారు. సిబ్బంది ఎల్లవేళలా పోలీస్‌స్టేషన్‌లో అప్రమత్తం ఉండాలని, శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా అందుబాటులో ఉండాలన్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి ఎటువంటి పెండింగ్ కేసులుల లేకుండా చూడాలని తెలిపారు. ఫైవ్ ఎస్ విధానాన్ని అమలు చేస్తూ రికార్డుల నిర్వహణను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సునీల్, శ్రీనివాస్, నవీన్ డీఎస్పీ కార్యాలయ సిబ్బంది జైపాల్, రవి, కిష్టయ్య, గణేష్ పాల్గొన్నారు.

పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

పరీక్షలలో ప్రతి ఒక్కరు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణులు కావాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుల్‌లకు రెండవ సెమిస్టర్ చివరి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ సందర్శించి పరిశీలించారు. 9 నెలల పాటు శిక్షణను తీసుకొని చివరి రాత పరీక్షను 254 మంది శిక్షణ కానిస్టేబుళ్ళకుకు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజామాబాద్ నుంచి విచ్చేసిన ప్రత్యేక పరీక్షల నిర్వహకులు ఆదిలాబాద్ జిల్లా లోని శిక్షణ కానిస్టేబుల్‌లకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినీయం, బిఎస్ఏలలో పరీక్షలు రాస్తున్నట్లు మిగిలినవి మూడు రోజులపాటు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ సి సమయ్ జాన్ రావు, నిజామాబాద్ సీటీసీ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, ఆర్ఐ కార్తీక్, ఆర్ఎస్ఐ రాకేష్ పాల్గొన్నారు.

నూతనంగా నియమితులైన ఉపాధ్యాయుల బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని మస్కాపూర్ ఉన్నత పాఠశాలకు నూతనంగా నియమితులైన ఏడుగురు ఉపాధ్యాయులు బుధవారం బాధ్యతలు చేపట్టారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భోనగిరి నరేందర్ తెలిపారు. డీఎస్సీలో మస్కాపూర్ ఉన్నత పాఠశాలకు 7గురు కొత్త టీచర్లను కేటాయించగా బుధవారం 6 గురు విధుల్లో చేరారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు తమ విధి నిర్వహణ పత్రాలను ఉపాధ్యాయులకు అందించారు. సోషల్‌కు ఆర్.కిషన్, ఏం చందన, సైన్స్‌కు, ఎండీ షఫీ, సీహెచ్ విజయ్ కుమార్, మ్యాథ్స్ సయ్యద్ ఫరాజ్, జె లక్ష్మన్ రావులు విధుల్లో చేరారు.

బదిలీపై వెళ్తున్న లైన్ మెన్‌కు సన్మానం



నవతెలంగాణ-నిర్మల్ రూరల్

విద్యుత్ శాఖ చేపట్టిన బదిలీల్లో భాగంగా మండలంలోని నిలాయిపేట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహించిన రమేష్‌ను బుధవారం గ్రామస్తులు సన్మానించారు. లైన్‌మెన్ రమేష్ గత కొన్నేళ్లుగా గ్రామంలో ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ముఖ్యంగా పంటల సాగుకు విద్యుత్ సరఫరా విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో భూమన్న, గంగన్న, అంజి, మహేందర్ ఉన్నారు.

అత్యవసర సమయంలో గర్భిణికి రక్తదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని సాలెగూడ గ్రామానికి చెందిన గర్భిణీ అనితకు అత్యవసర సమయంలో బుధవారం రిమ్స్ హెల్ప్ డెస్క్ సభ్యులు సుధాకర్ ఠాక్రే ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. అనిత కుటుంబ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

పాము కాటుతో మహిళా మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



పాము కాటుతో మహిళా మృతి చెందిన సంఘటన బుధవారం మండలములోని కొబ్బాయిగూడలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు బంధు వులు తెలిపిన వివరాల ప్రకారం.. కొబ్బాయిగూడకు చెందిన ఆశా వర్కర్(40) కుమ్ర ద్రుపతాబాయి కుటుంబ సభ్యులతో నిద్రపోగా మంగళవారం రాత్రి రెండు గంటల సమయంలో పాము కాటు వేసింది. వెంటనే 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రిటైర్డ్ పీఈటీ మృతి

నవతెలంగాణ-ఖానాపూర్



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రిటైర్డ్ పీఈటీ నాఫే ఖాన్ (58) బుధవారం హైదరాబాదు ఆస్పత్రిలో మృతి చెందినట్టు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఈ నెల 14 ఖానాపూర్‌లోని శివాజీ నగర్‌లో పాత ఇల్లు కూల్చివేసి పనులు పూర్తి చేసుకొని నాఫే ఖాన్ మోటార్ సైకిల్‌పై తిరిగి నిర్మల్ తన నివానికి వెళ్తున్న క్రమంలో ఎక్బాల్‌పూర్ శివారు వద్ద మోటార్ సైకిల్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో వైద్య చికిత్సల కోసం ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించాలి

- జాతీయ సైన్స్, సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలు
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలని జిల్లా సైన్స్ అధికారి రఘురమణ అన్నారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్-2లో జిల్లా స్థాయి జాతీయ సైన్స్, సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలను నిర్వహించారు. ఇందులో ఆయా పాఠశాలల విద్యార్థులు సైన్స్‌తో కూడిన డ్రామాలు చేస్తూ అలరించారు. పర్యావరణం, ప్రజలకు ఉపయోగపడే విషయాలను వివరిస్తూ పోటీల్లో పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు వారి ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. కాగా రాష్ట్ర స్థాయిలో పోటీలు ఈనెల 18న హైదరాబాద్‌లో జరుగనున్నాయి. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి రఘురమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్, ప్రయోగాలపై అవగాహన పెంచేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా స్థాయి జాతీయ సైన్స్, సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలకు స్పందన వచ్చిందన్నారు. సైన్స్ సెమినార్ 16 మంది విద్యార్థులు, డ్రామాలో ఏడు పాఠశాలలు ఆరు థిమ్స్ పాల్గొన్నాయన్నారు. ఇందులో సెమినర్‌కు జోసెఫ్ కాన్వెంట్ స్కూల్ విద్యార్థి, డ్రామాలో జడ్పీఎస్ఎస్ లక్ష్మీపూర్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరు హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మూడు సంవత్సరాల నుంచి జాతీయ స్థాయిలో ఆదిలాబాద్ రాణిస్తుందని ఇసారి కూడా అదే జరుగుతుందని ఆశభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సైన్స్ ఆఫీసర్ అరె భాస్కర్, పాఠశాల హెచ్ఎం ఎం. సుధాకర్, లక్ష్మీపూర్, జైనథ్ హెచ్ఎంలు పోరెడ్డి అశోక్, మద్ది లస్మన్న, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నూతుల రవీందర్ రెడ్డి, మ్యూజిషియన్ మేస్రం రాజు, మహేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





రాష్ట్ర సదస్సుకు బయలుదేరిన నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర సదస్సుకు బుధవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు వెళ్లారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ, నాయకులు ఉన్నారు.

ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.10 కోట్ల నిధుల విడుదల

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

సీఆర్ఆర్ ఫేస్ గ్రాంట్స్ కింద ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీటీ రోడ్లు, బ్రిడ్జి పనులకు గాను రూ.10 కోట్లు విడుదలైనట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గతంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, పంచాయతీ రాజ్, స్త్రీ మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు లేఖల ద్వారా ప్రతిపాదనాలు పంపినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం రూ. 10 కోట్లు విడుదల చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు కంది శ్రీనివాస రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అతి త్వరలోనే ప్రపోజల్స్‌లో మిగతా అభివృద్ధి పనుల నిధులు దాదాపు రూ.120 కోట్ల వరకు విడుదల అయ్యే అవకాశముందన్నారు.

పాఠశాల అభివృద్ధికి పలువురు దాతల ఆర్థిక సాయం

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని మన్మద్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల అభివృద్ధికి పలువురు దాతలు ఆర్థిక సాయం అందించారు. ఈ క్రమంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో దాని మరమ్మతులకు వీడీసీ చైర్మన్, సభ్యులు రూ.30 వేలు, కుట్టు మిషన్‌కు రూ.6500 ఇచ్చారు. జేడ్ల రాజారాం రూ.13 వేలు వెచ్చించి సిమెంటు బస్తాలు, బెంచీలు తయారు చేయించి చేయూత నిచ్చారు. అలాగే 1995-96 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి మాజీ ఎంపీపీ లలిత భోజన్న పాఠశాల ప్రాంగణంలో నూతన సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల గోడలకు సామెతలు, సూక్తులను గంగాకిషన్ రాయించారు. 10వ తరగతి విద్యార్థులకు జేడ్ల నారాయణ ఎగ్జామ్ ప్యాడ్స్, స్టడి మెటీరియల్ అందజేశారు. లైన్ మెన్ గంగకిషన్ రూ.3000 వేలు వెచ్చించి తాగునీటి గ్లాసులు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి వీడీసీ సభ్యులు, గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు కృషి చేయడం చాలా అభినందనీయమని, ఉపాధ్యాయులు కూడా పాఠశాల అభివృద్ధికి విద్యార్థులకు చక్కని విద్యను అందించి వారిని ఉన్నత శిఖరాలకు తీర్చి దిద్దలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మల్క గౌడ్ అన్నారు. అనంతరం వీడీసీ చైర్మన్ శేఖర్‌రెడ్డినీ, సభ్యులను, పలువురు దాతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పుష్ప రఘుపతిరెడ్డి, ఉపాధ్యాయులు దేవేందర్, గంగాధర్, రాజేందర్, సుధీర్ కుమార్, రమ దేవి, వినోద్‌రెడ్డి, విజయ కుమారి, నవీన్ కుమార్, పాల్గొన్నారు.

వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

నిర్దేశించిన గడువులోగా వందా శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని డీఎల్పీఓ ప్రభాకర్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఖైర్‌దాట్వా గ్రామపంచాయితీని ఆయన సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ శానిటేషన్ పనులను బావుల్లో క్లోరినేషన్ చేస్తున్న తీరును పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. ఆయన వెంట ఏంపీఓ స్వప్న శీలా, కార్యదర్శి మమత ఉన్నారు.

సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ప్రారంభించారు. ముందుగా తొలి రైతుని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల వద్ద అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ. 4892 ప్రకటించిందన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు అధికారులు నీరు, భోజన వసతి కల్పించాలన్నారు. ఇందులో మార్క్‌ఫెడ్ అధికారులతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు ఆడే వసంత్, బీఆర్ఎస్ నాయకులు, సాబ్లే నానాక్ సింగ్, మండల మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, గోతి గులాబ్ సింగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

మండల కేంద్రానికి చేందిన అనిల్ అన్న యువ సైన్యం సభ్యుడు గాజుల సాయి కుమార్ వివాహనికి బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరై నూతన వదు వరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు సాబ్లే నానాక్ సింగ్, మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, ప్రతాప్ సింగ్, గోతి గులాబ్ సింగ్ ఉన్నారు.



అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం మానుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తు కేసులు నమోదు చేయడం మానుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉట్నూర్ పీఎస్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదు చేయడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా జోగురామన్న మాట్లాడుతూ.. మూసి నదిపై సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడారని కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ ఫిర్యాదుతో కేటీఆర్‌పై కేసు నమోదు చేశారన్నారు. అంతకంటే ముందు ఈ నెల 8న డీఎస్పీకి పార్టీ తరపున 420 హామీ ఇచ్చి మోసం చేసిన సీఎంపై చిటింగ్ కేసు పెట్టాలని తాము ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. పోలీసులు అధికార పక్షానికి అనుకూలంగా ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం సరికాదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రశ్నించే గొంతులను నొక్కుతోందని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ అందరికి చేశామని సీఎం ప్రకటిస్తే అదే వ్యవసాయ శాఖ మంత్రి ఇంకా 20 లక్షల మంది రైతులకు చేయాల్సి ఉంటుందని ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఇలా ప్రజలు, రైతులను మోసం చేస్తున్న సీఎంపై ఎందుకు కేసు నమోదు చేయొద్దో పోలీసులు చెప్పాలన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు విజ్జగిరి నారాయణ, యాసం నర్సింగరావు, మార్శెట్టి గోవర్ధన్, కుంమ్ర రాజు, పరమేశ్వర్, ఇజ్జగిరి అశోక్, పురుషోత్తం, నవాతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి రహిత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నవతెలంగాణ-ఇచ్చోడ



గాలికుంటు వ్యాధి రహిత మండలంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశు వైద్య అధికారి గోవింద్ నాయక్ అన్నారు. బుధవారం ఇచ్చోడ మండలంలోని ముక్రా(కె) గ్రామంలో ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా 420 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అందులో 180 ఆవులకు,170 గేదెలకు,130 ఎడ్లకు. టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, వైద్య సిబ్బంది శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

విధుల్లో నూతన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-బెజ్జూర్



ప్రభుత్వం ఇటీవల నూతన ఉపాధ్యాయుల నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో ఉపాధ్యాయ ఉత్తర్వులు అందుకున్న వారు బుధవారం మండలంలోని ఆయా స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంల వద్ద రిపోర్ట్ చేసి బాధ్యతలను స్వీకరించారు. మండలంలో మొత్తం 46 పాఠశాలలుండగా 36 మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీలపై వెళ్లగా వారి స్థానంలో నూతన ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వారు జాయిన్ కావడంతో బదిలీ అయిన ఉపాధ్యాయులను వారివారి స్థానాలకు బదిలీ ఉత్తర్వులు అందించారు. బెజ్జూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో 18 మంది నూతన ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎంఈఓ సునీతకు వారు రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు.

ఏఈఓలకు సహాయకులను నియమించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలతో డిజిటల్ క్రాఫ్ట్ సర్వే కోసం తాత్కాలిక ఉద్యోగులను ఏఈఓలకు సహాయకులుగా నియమించాలని ఏఈఓల సంఘం నాయకులు కోరారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాఫ్ట్ సర్వే కోసం దేశంలోని పలు రాష్ట్రాలలో తాత్కాలిక సిబ్బందిని సహాయకులుగా నియమించారన్నారు. అదే మాదిరిగా రాష్ట్రంలో కూడా నియమించి ఏఈఓలకు ఉన్న పని భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిరంజీవి, రాము పాల్గొన్నారు.

నిషేధిత పొగాకు పట్టివేత



నవతెలంగాణ-వాంకిడి

అక్రమంగా తరలిస్తున్న రూ.2.20 లక్షల విలువ గల నిషేధిత పొగాకు ఉత్పత్తులను పోలీసులు పట్టుకున్నారు. బుధవారం ఏఎస్ఐ పోశెట్టి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సయీద్ ముస్తఫా(ఇందిరానగర్) వాంకిడి, మరో వ్యక్తి కారు డ్రైవర్ టెంబుర్కర్ చంద్రకాంత్(చంద్రాపూర్) మండల కేంద్రం నుండి నిషేధిత పొగాకు ఉత్పత్తులను కారులో అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు స్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. వారి వద్ద నుండి హులహుక్క సీషా టోబాకో 10 సంచులు లభించాయని, వాటి విలువ సుమారు రూ.82 వేలు, ఈగల హుక్కా సీషా టోబాకో 216 ప్యాకెట్లు లభించాయని వాటి విలువ సుమారు రూ.1.38 లక్షలు ఉంటుందన్నారు. మొత్తం పట్టుబడిన నిషేధిత పొగాకు విలువ సుమారు రూ.2.20 లక్షలు ఉంటుందన్నారు. పట్టుబడిన నిషేధిత పొగాకు సంబంధించిన ఎలాంటి రసీదులు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



నవతెలంగాణ-కౌటాల

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును ముత్తంపేట్ బ్యాంకు శాఖాధికారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని కనికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం పొదుపు చేయడంలో పాటించే మెళుకువలు, సామాజిక భద్రత పథకాలను పాటల రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ నిర్వహణ శాఖ అధికారి రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆధార్ అనుసంధానం చేసుకుని వేలిముద్రల సాయంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీఎస్పీ సెంటర్ల ద్వారా లావాదేవీలు చేసుకోవాలని, డిజిటల్ లావాదేవీలు జరిపేవారు తమ పాస్వర్డ్‌ను ఎవరికీ తెలియజేయొద్దన్నారు. పంట రుణాలను సంవత్సరంలోపు చెల్లిస్తే ఏడు శాతం వడ్డీ ఉంటుందన్నారు. ఆలస్యం అయితే 12.50 శాతం నుండి 13శాతం వరకు వడ్డీ రేటు ఉంటుందన్నారు. రైతులందరూ రుణాలను సకాలంలో చెల్లించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులు సకాలంలో రుణాలను తీసుకుని సక్రమంగా కట్టాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మహేష్, సీసీ విలాస్, ఏపీఎం ముక్తేశ్వర్, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, బ్యాంక్ ఖాతాదారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని చెడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత, సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారి గొల్ల ప్రవీణ్ కుమార్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న వివిధ రకాల సేవలను విద్యార్థులు తల్లిదండ్రులకు తెలియజేయాలని, ప్రతి ఒక్కరు బ్యాంకులో ఖాతాలను కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరు బీమా చేయించుకోవాలని, పంట రుణాలు బ్యాంకులో పొందాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి, పరీక్ష ప్యాడ్లు, బిస్కెట్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాకేష్, ఉపాధ్యాయుడు వెంకటేష్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేటి కుమురంభీం వర్ధంతిని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-బెజ్జూర్

ఆదివాసుల ఆరాధ్యదైవం కుమురం భీం వర్ధంతి వేడుకల్లో ఆదివాసులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ ఈనెల 17న ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి రోజున ఆదివాసీ పోరాట యోధుడు, జల్ జంగిల్ జమీన్ కోసం పోరాటం చేసి ఆదివాసీ హక్కుల చట్టాల కోసం నిజాం సైన్యాన్ని గడగడలాడించిన అమరజీవి ఆదివాసీల ఆశాజ్యోతి భీం వర్ధంతిని ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో గ్రామ గ్రామాలలో నివాళులర్పించి సేవలను స్మరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదివాసీ పెద్దలు, నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలో గురువారం నిర్వహించే కుమురం భీం వర్ధంతిలో అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు సోయం భీంరావు తెలిపారు. ఉదయం జెండా వందనం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

హత్య కేసులో 16 మందికి జీవిత ఖైదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వ్యక్తి హత్యకు కారణమైన 16 మందికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా జడ్జీ ఎంవీ రమేష్ తీర్పు వెలువరించారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం రెబ్బెన మండలం సింగిల్ కూడా గ్రామానికి చెందిన అజ్మీర రమేష్ 2020 ఆగస్టు 19న జరుపుల సురేష్‌తో పాటు మరో 15 మంది చేతిలో హత్యకు గురికాగా పోలీసులు సాక్షాలు కోర్టుకు సమర్పించగా జిల్లా జడ్జీ నిందితులకు జీవిత ఖైదు విధించడంతో పాటు రూ. 1,49,000 అపరాధ రుసుము విధిస్తూ తీర్పు వెలువరించారు.

నేడు గోండు వీరుడు భీం వర్ధంతి

- తరలి రానున్న గిరిజనులు
- హాజరు కానున్న మంత్రి సీతక్క

జల్..జంగిల్..జమీన్.. అంటూ.. ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన గోండు బెబ్బులి కుమురం భీం వర్ధంతి ఆయన యాదిలో ఆదిలాబాద్ సహా యావత్ రాష్ట్రంలోని ఆదివాసులు స్మరణ చేసుకుంటున్నారు. 'మావనాటే మావ సర్కార్' అంటూ గర్జించి ఉద్యమించిన యోధుడు కుమురం భీం. ఆయన వర్ధంతిని గురువారం మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించనున్నారు. దీనికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఆదివాసులు జోడేఘాట్‌కు తరలి వస్తారు. వర్ధంతి వేడుకలకు రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరు కానున్న నేపథ్యంలో పోలీసులు, వర్ధంతి నిర్వాహణ కమిటీ సభ్యులు దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



నవతెలంగాణ-కెరమెరి

పోరాటంలో వెన్నుపోటుదారుల కుట్రలకు గోండు బెబ్బులి నేలకొరిగింది. అయినా పోరాటం మాత్రం ఆగలేదు. తెలంగాణ విముక్తి వరకు సాగిన ఉద్యమంలో ఆ మహనీయుల పోరాటాన్ని అడుగడుగునా గుర్తు చేసుకుంటూ పోరు సాగించింది. ఇప్పటికీ సాగిస్తూనే ఉంది కెరమెరి మండలంలోని జోడేఘాట్ నేల అప్పటి ఆదిలాబాద్ ఇప్పటి ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి అడవుల కేంద్రంగా సాగిన గోండుల పోరు ఇప్పటికీ ఈ నేలకు కొత్త పోరాటాన్ని నేర్పుతూనే ఉంది. అసఫ్‌జాహి రాజవంశానికి వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని విప్లవ జ్వాలగా మండించేందుకు 1901 అక్టోబర్ 22న ఆసిఫాబాద్ మండలంలోని సంకేపల్లిలో గోండు ఆదివాసుల కుటుంబంలో జన్మించాడు.

పోరాటనికి శ్రీకారం

నిజాం సర్కార్ పాలనలో అటవీశాఖ సిబ్బంది జరిపిన దాడిలో తన తండ్రి మరణించడంతో కుటుంబంతో కలిసి కెరమెరి ప్రాంతంలోని సర్దాపూర్‌కు వలస వెళ్లింది భీమ్ కుటుంబం. ఆ సమయంలో సర్దాపూర్ ప్రాంతంలో నిజాం పాలన సాగుతుండగా దానికి వ్యతిరేకంగా గొరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసి జల్, జంగిల్, జమీన్ పోరాటానికి శ్రీకారం చుట్టారు కొమరం భీం. నిజాం అధికారాలు, చట్టాలు, న్యాయస్థానాలను వ్యతిరేకిస్తూ ఆదివాసుల హక్కుల కోసం భీం చేసిన వీరోచిత పోరాటం అనిర్వచనీయం. కొండ కోనల్లో, ప్రకృతితో సహ జీవనం సాగించే ఆదివాసీ ప్రజలకు అడవిపై హక్కు సామాజిక న్యాయంలో భాగమని నినదించాడు. నిజాం నవాబు పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా గిరిజనులను ఒక్క తాటిపై నడిపించి ఉద్యమాన్ని ఉధృతం చేశాడు. ఆసిఫాబాద్, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబుపై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించిన తీరు అద్భుతం. కానీ కుర్దు పటేల్ అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో 1940 అక్టోబర్ 17న జోడేఘాట్ అడవుల్లోని కుమురం భీమ్ స్థావరాన్ని ముట్టడించిన నిజాం సైన్యం భీమ్‌ను అత్యంత కిరాతకంగా హతమార్చింది. భీం సహా పన్నెండు మంది ఆదివాసీ వీరులు అమరులయ్యారు. నిజాం సర్కారు పాశవికంగా కొమరం భీం పోరాటాన్ని అణచివేసింది. నాటి నుండి నేటి వరకు భీం అమరుడైన పురిటీగడ్డ గడ్డ జోడేఘాట్‌లో ప్రతి ఏటా ఆశ్వయుజ పౌర్ణమి రోజున కుంరం భీంను ఉమ్మడి స్మరించుకునేందుకు అధిక సంఖ్యలో గిరి ప్రజలు తరలి వెళ్తారు.

హాజరు కానున్న మంత్రి సీతక్క

భీం 84 వర్ధంతికి మంత్రి సీతక్క హాజరు కానున్నారు. మొదట కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించనున్నారు. అనంతరం గిరిజనులతో ఆదివాసీ సాంప్రదాయ పద్ధతిలో భీం కుటుంబ సభ్యులు చేసే సాంప్రదాయ పూజల్లో పాల్గొని దర్బార్‌లో పాల్గొంటారు.



విద్యాభివృద్ధికి ప్రభుత్వం పటిష్ట చర్యలు

- రాష్ట్ర మంత్రి సీతక్క
- గుండి పాఠశాల ప్రారంభోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పునరుద్ఘాటించారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమెకు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి జిల్లా కేంద్రంలోని అటవీశాఖ గెస్ట్ హౌస్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం గుండి గ్రామంలో పదో తరగతి వరకు ఉన్నతీకరించిన పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠశాల ఉన్నతీకరణతో గ్రామీణ ప్రాంతంలో విద్య అభివృద్ధి చెందుతుందన్నారు. గుండి గ్రామానికి మధ్యలో అడ్డుగా ఉన్న పెద్దవాగుపై వంతెన సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. గుండి గ్రామం నుండి కనరగాం రహదారి కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో అంతర్గత రహదారులు లేని చోట అవసరమైన రహదారులు నిర్మిస్తామన్నారు. ఇదే సందర్భంలో గ్రామ మాజీ సర్పంచ్ పెండింగ్ బిల్లుల విషయమై మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అనంతరం తిరిగి వచ్చేటప్పుడు వాగులో నడుచుకుంటూ రావడంతో నాయకులు, అధికారులు ఆమెను అనుసరించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి





నవతెలంగాణ-ఆసిఫాబాద్

పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ కోసం నెల రోజుల పాటు నిర్వహించే వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి మురళీకృష్ణ అధ్యక్షతన మండలంలోని చిర్రకుంట గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశు వైద్యాధికారి సురేష్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పశువులు ఆవులు, ఎడ్లు, బర్రెలకు తప్పనిసరిగా గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. జిల్లావ్యాప్తంగా నెలరోజుల పాటు ఈ శిబిరాలు కొనసాగనున్నట్లు వెల్లడించారు. పశువైద్యాధికారులు ప్రతి పశువుకు టీకాలు వేసేలా చూడాలన్నారు. మండల వైద్యాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పశు వైద్య శిబిరంలో భాగంగా 550 పశువులకు టీకాలు వేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మోతీరం, వినోద్, ప్రశాంత్, గజనంద్, నాగార్జున పాల్గొన్నారు.

తిర్యాణి : మండలంలోని గోయగాం గ్రామ పంచాయతీలోని రాంబాయిగూడెం తదితర గ్రామాల్లో బుధవారం ఆవులకు, గేదెలకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించినట్టు పశు వైద్యాధికారి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం 421 పశువులకు టీకాలు వేయడం జరిగిందని, ఇంకా ఏవైనా పశువులకు టీకాలు వేయకపోయినా వాటికి సంబంధించిన రైతులు టీకాలు వేసుకోవాలని, పశువులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంటలకు పాడి పశువుల ఎరువులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, పశువులకు ఏదైనా వ్యాధులు సోకితే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సురేష్, మనోహర్, సంతోష్, రైతులు, పశువుల యజమానులు పాల్గొన్నారు.

కౌటాల : మూడ జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని మండల పశు వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఉచిత గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి మాట్లాడుతూ వచ్చే నెల 15 వరకు ఉచిత పశు వైద్య శిబిరం మండలంలోని అన్ని గ్రామాలలో నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గేదెలకు, పశువులకు నాలుగు సంవత్సరాలపై బడిన పశువులకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, సందీప్, భిక్షపతి రైతులున్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని ఎల్లూరు, పెంచికల్‌పేట్ గ్రామాల్లో పశు వైద్య, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో నాలుగు నెలలు పైబడిన పశువులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి రాకేష్ తెలిపారు. ప్రతి ఒక రైతు పశువులకు ఖచ్చితంగా టీకాలు వేయించాలని, నెల రోజుల పాటు టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. పశు వైద్య సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు సహకరించి తగిన సమయంలో పశువులకు టీకాలు వేయించి వ్యాధుల బారి నుండి పశువులను రక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి సురేష్, అటెండర్ ఆనంద్‌రావు, శివ, శేఖర్, రైతులు పాల్గొన్నారు.

కుమురం భీం వర్ధంతికి పటిష్ట బందోబస్తు

- ఎస్పీ డీవీ.శ్రీనివాస్



నవతెలంగాణ-కెరమెరి

గోండు వీరుడు కుమురం భీం 84వ వర్ధంతి కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. భీం కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్క రానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటుపై బుధవారం ఓ ఫంక్షన్ హాల్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందికి భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేస్తు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీం వర్ధంతికి ఇతర రాష్ట్రాల నుండి ప్రజల అధిక సంఖ్యలో హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్, వీఐపీ పార్కింగ్, హెలిప్యాడ్ వద్ద బందోబస్తు పటిష్టంగా చేపట్టాలన్నారు. కేటాయించిన ప్రాంతంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డ్యూటీ పరంగా ఎలాంటి సందేహమున్నా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు. విధులు నిర్వహించే ప్రదేశంలో అవాంఛనీయ ఘటన ఎదురైతే వెంటనే పై అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ బందోబస్తులో అదనపు ఎస్పీతో పాటు ముగ్గురు డీఎస్పీలు, 15 సీఐలు, 28 ఎస్సైలు మొత్తంగా 460 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియామించినట్టు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాతో పాటు రామగుండం కమిషనరేట్, భూపాలపల్లి ,జగిత్యాల, ములుగు జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ ప్రభాకర రావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు కరుణాకర్, రామానుజన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఆర్ఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



నవతెలంగాణ-తిర్యాణి

ప్రపంచంలోని పేదలందరికీ ఆహారం అందాలని యక్షి స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షురాలు కమల అన్నారు. బుధవారం మండలంలోని గడలపల్లి, గ్రామ పంచాయతీలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జై జంగుబాయి మహిళా సంఘం ఆధ్వర్యంలో గిరిజన వంటకాలను అతిథులకు వడ్డించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రాచీన సంస్కృతి గ్రామాల్లోని జీవితాలను చిన్నాభిన్నం చేసిందని తెలిపారు. అందుకు అనుగుణంగానే గ్రామాల్లో ఆహారపు అలవాట్లలో మార్పు వచ్చి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు కమల మాట్లాడుతూ ప్రపంచంలోని పేదలందరికీ ఆహారం అందాలనే ముఖ్య ఉద్దేశంతో యక్షి స్వచ్ఛంద సేవ పని చేస్తుందని తెలిపారు. తమ గ్రూపు సభ్యులతో ప్రతి సంవత్సరం మండలంలో ఏదో ఒక గ్రామంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. గ్రామాల్లోని రైతులంతా చిరుధాన్యాలను పండించి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గడలపల్లి మాజీ సర్పంచ్ గుణావంత్ రావు, మాజీ సర్పంచ్ రాధాబాయి, జిల్లా రాయి సెంటర్ మేడి కుర్సెంగ మోతిరాం, రాజ్ గోండు సేవా సంఘం సభ్యులు మడావి నర్సింగ్ రావు, రిటైర్డ్ టీచర్ తాను, ఉప సర్పంచ్ కట్టి, గ్రామ పటేళ్లు, యక్షి స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కుల గణన వేగంగా పూర్తి చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన వేగంగా పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ డిమాండ్ చేశారు. కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్, మహాత్మ జ్యోతి పూలే విగ్రహాలకు నాయకులతో కలిసి పుష్పాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణన కోసం రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడం హర్షణీయమన్నారు. అయితే ఇదే వేగంతో కులగణన పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీసీలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కను శాలువాతో ఘనంగా సన్మానించారు. జీఓ విడుదలపై ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘ ప్రధాన కార్యదర్శి గాజుల జక్కన్న, రైతు సంఘ జిల్లా అధ్యక్షులు వైరాగడే మారుతీ పటేల్, కమ్మల వెంకన్న, మోహన్, కావల్కర్ నారాయణ, ఆనంద్ రావ్ పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు

నవతెలంగాణ-కౌటాల



మండలంలోని గుడ్లబోరి గ్రామ శివారులో 15 సర్వే నంబర్స్‌లలో వివిధ పంటల వివరాలు జిల్లా వ్యవసాయ అధికారి రావురి శ్రీనివాస రావు పంటల వివరాల నమోదు క్రాప్ బుకింగ్ ఏన్ హాన్స్‌మెంట్ ఆప్‌లో నమోదు చేశారు. ఈ సర్వే ద్వారా వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసిన పంటల వివరాలు కరెక్ట్‌గా ఉన్నాయా లేదా అనేది కచ్చితంగా తెలుస్తుందన్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ద్వారా రైతులు పంటలు అమ్ముకునే సమయంలో ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో వివిధ పంటలలో రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చౌదరి, అంజన్న రైతులున్నారు.

ఓరియంట్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని గట్రావ్‌పల్లి గ్రామ పంచాయతీలోని సాలేగూడెం గ్రామంలో ఓరియంట్ సిమెంట్ ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాలును బుధవారం ఓరియంట్ సిమెంట్ యూనిట్ హెడ్ బాల గిరిధర్, ఊరు పెద్దలు జైతు పటేల్, మాజీ సర్పంచ్ పెంద్రం రాజు, గణపతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనిట్ హెడ్ బాల గిరిధర్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్‌ను గట్రావ్‌పల్లి పంచాయతీ గ్రామ ప్రజలకు అప్పగిస్తున్నామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జీఎం ఆనంద్ కులకర్ణి, ఏజీఎం ఉమా శంకర్ పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-వేమనపల్లి



పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీఆర్ఎస్ అధ్యక్షుడు కోలి వేణుమాధవ్ రావు డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కురిసిన వర్షాలకు, గ్రామాలలో ప్రాణహిత నది బ్యాక్ వాటర్ వల్ల వందల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేశం, సీనియర్ నాయకులు పురాణం లక్ష్మీ కాంత్, మాజీ సర్పంచులు కొండగొర్ల బాపు, మోర్ల పద్మ-మొండి, టొర్కుటి సంతోష్, మాజీ ఉప సర్పంచ్ సత్యం పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి యాజమాన్యంతో పాటు కార్మిక సంఘాల నాయకులు న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపించాలని జైపూర్ ఎస్టీపీపీ 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘానికి లేఖ రాసిన కార్మికులు సోలార్ ప్లాంట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే విధంగా కృషి చేయాలని కోరారు. నెల వారి జీత భత్యాలు ప్రతి నెల 6 నుంచి లోపు జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఒక వేల సక్రమంగా జీతాలు చెల్లించని సంధర్భంలో విధులకు హాజరు కాలేమని లేఖలో పేర్కొన్నారు. జీత భత్యాలు పెంచాలని, సోలార్ ప్లాంట్ ఏరియాలో కనీస మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. అంతేకాకుండా ఎస్‌సీసీఎల్ ద్వార మంజూరైన బోనస్ ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాల్లో జమ చేయలేదని కోరారు.

మంచిర్యాల సీఐగా ప్రమోద్‌రావు

నవతెలంగాణ-మంచిర్యాల



పట్టణ సీఐ బన్సీలాల్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రమోద్‌రావు నియమితులయ్యారు. మల్టీ జోన్ ఐజి 1 మంచిర్యాల పట్టణ సిఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్ బన్సీలాల్‌ను ఐజి కార్యాలయానికి బదిలీ చేశారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఐటి సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ప్రమోద్‌రావు ను మంచిర్యాల పట్టణ సీఐగా నియమించారు.

మండల కేంద్రానికి చేరుకున్న ఉధ్యమకారుల పాదయాత్ర



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ రాష్ట్ర సాధనకు అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ కారులకు న్యాయం చేయాలని కోరుతూ చేపట్టిన పాదయాత్ర బుధవారం మండల కేంద్రానికి చేరుకుంది. రాష్ట్ర అధ్యక్షులు దాసర్ల శ్రీశైలం భీంరావ్, లక్ష్మణ్ ఆధ్వర్యములో జిల్లా కేంద్రం నుంచి ఈ నెల 15న ఆరంభమైన పాద యాత్ర 29న ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల పలు డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆంధ్ర కాలనీలో దొంగల హల్ చల్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టంలోని ఆంధ్రా కాలనీలో దొంగలు హల్‌చల్ చేశారు. దసరా పండుగ కోసం బంధువుల ఇంటికి వెళ్లిన వచ్చిన అదే కాలనీకి చెందిన ప్రయివేట్ ఉపాధ్యాయుడు ప్రసన్న కుమార్ ఇంట్లో దొంగతనం జరిగినట్టు భావించారు. ఎస్సై టీ సతీష్ కుమార్, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా పండుగ సెలవులుండటంతో సతీష్ కరీంనగర్‌లోని బంధువులకు ఇంటి వెళ్లాడు. తిరిగి సోమవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరించారు. ఇంట్లోని రూ. 7 వేల నగదుతో పాటు నిత్యావసరాల కోసం దాచుకున్న రూ.1500లను కూడా దోచుకెల్లినట్టు బాధితుడు తన ఫిర్యాదులో తెలిపారు. అయితే ఎస్సై ఈ కేసు విషయంలో ఇద్దరు అనుమానితులను గుర్తించామని త్వరలోనే కేసు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

వర్తక సంఘం ఆధ్వర్యం ఆర్థిక సాయం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రానికి చెందిన హమాలీ కార్మికుడు జగన్ కుటుంబ సభ్యులకు వర్తక సంఘం నాయకులు రూ.13,500 ఆర్థిక సాయం అందజేశారు. హమాలి జగన్ ఇటీవల లారీ నుండి పడిపోవడంతో చెయ్యి, కాలు విరిగింది. ఆయన చికిత్సకు రూ.4 లక్షలు అవసరమని వైద్యులు తెలిపారు. వర్తక సంఘం తరపున బుధవారం జగన్ కుటుంబ సభ్యులకు రూ.13,500 అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వామన్, జె.రమేష్, శివకృష్ణ పాల్గొన్నారు.

స్కాలర్షిప్ కోసం కదం తొక్కిన విద్యార్థులు

నవతెలంగాణ-మంచిర్యాల



గత మూడు సంవత్సరాల నుండి స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబందించిన నిధులు విడుదల చేయాలని కళాశాలల యాజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులు కదంతొక్కారు. బుధవారం జిల్లా కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వాన్ని వేడుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమన్యాలు మాట్లాడుతూ ప్రభుత్వం దాదాపు మూడు సంవత్సరాల నుండి ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉంచడంతో అధ్యాపకులకు జీతాలు, భవనాల అద్దె, ఇతరత్రా నిర్వహణ ఖర్చులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా ఏర్పడిన ఈ ప్రభుత్వాన్ని అనేకసార్లు కలిసి మా ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లామని అయినప్పటికి ఎలాంటి స్పష్టత హామీ గాని ప్రభుత్వం నుంచి రాలేదన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో కళాశాలలు నిర్వహించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్‌ను పాటిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాంతియుత ర్యాలీలో దాదాపు 1000 మంది విద్యార్థులు ఐబి చౌరస్తా నుండి బెల్లంపల్లి చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి బెల్లంపల్లి చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. జిల్లాలో ఉన్న విద్యార్థి సంఘాల నాయకులూ కళాశాలల శాంతియుత ర్యాలీకి మద్దతు తెలిపారు.



అతిథి అధ్యాపకులను కించపరిస్తే ఊరుకోం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను కించపరిస్తే చూస్తూ ఊరుకోమని అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు జిల్లాలోని పలు కళాశాలల అతిథి అధ్యాపకులు నల్ల బ్యాడ్జలు ధరించి విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం లక్షెట్టిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎకానమిక్స్ రెగ్యులర్ అధ్యాపకుడు, ఎగ్జామినేషన్ బ్రాంచ్ ఇన్‌చార్జి తిరుపతి తనను అకారణంగా దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తిరుపతి బాధ్యతయుతమైన ఉద్యోగంలో ఉండి తోటి అధ్యాపకులను చులకనగా మాట్లాడటం మంచిది కాదన్నారు. గెస్ట్ లెక్చరర్స్ కూడా రెగ్యులర్ లెక్చరర్స్‌తో పాటు సమానంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇకపై కించపరిచేలా మాట్లాడితే తమ పద్ధతిలో అర్థమయ్యేలా చెబుతామన్నారు. అంతేకాకుండా తిరుపతి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ మహాత్మకు అధ్యాపకుడు తిరుపతిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ సంఘం అధ్యక్షులు పోరెడ్డి సత్యనారాయణ, మహేష్, రాజేశం, భవాని, అరుణ పాల్గొన్నారు.

టేకుమట్ల గ్రామంలో పర్యటించిన కేంద్ర బృందం



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని కేకుమట్ల గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు తీరును బుధవారం కేంద్ర కమిటీ మానిటరింగ్ బృందం పరిశీలించింది. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పని తీరు పరిశీలించింది. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమైన సభ్యులు ఉపాధి హామీ పనులు, ఎస్‌హెచ్‌జీ మహిళా గ్రూపుల కోసం చేపట్టిన చర్యలు, గ్రామ పంచాయతీ ప్రొఫైల్స్, ఖర్చు, నిల్వ, పెన్షన్, జనాభ లెక్కలు కేంద్ర ప్రభుత్వం నిధులతో గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన పనుల వివరాలు గ్రామస్థులను అడిగి తెల్సుకున్నారు. అదేవిధంగా జీపీడీపీ ప్రణాళిక తయారీ విధానం, మిషన్ అంత్యోదయ గ్యాప్ ఇతర శాఖలతో గల సమన్వయం, వాత్సల్య పథకం అమలు తదితర అంశాలపై ప్రజలను అడిగి తెల్సుకున్నారు. ఈ సంధర్భంగా కేంద్ర కమిటి మానిటింగ్ టీం సభ్యులు కేహెచ్ సునిల్, సీవీ బాలమురళీలను ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శ్రీపతి బాపు రావు, ఏపీడీ సదానందం, ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వర్లు, ఈసీ రాజమొగలి తదితరులు శాలువాలతో సన్మానించారు.

పూలే దంపతుల చిత్రపటానికి పుష్పాభిషేకం

నవతెలంగాణ-జన్నారం

బీసీ సంఘాల ఉద్యమం ఫలించిందని 10వ తేదీన సమగ్ర కుల గణన సర్వే చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుద చేసిందని బీసీ కులాల ఉద్యమ పోరట సంఘం జిల్లా కోకన్వీనర్ కడారుల నర్సయ్య అన్నారు. బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబాపూలే దంపతుల చిత్రపటాలకు పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సహచర మంత్రివర్గ సభ్యులు ఉన్నతాధికారులు కలిసి సమగ్ర కుల గణన సర్వే చేపడుతున్న సందర్భంగా వారికి ధన్యవాదాలు భినందనలు తెలిపారు. 60 రోజుల లోపల సమగ్ర కులగణన సర్వే చేపట్టి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య , కోకన్వీనర్ మూల భాస్కర్ గౌడ్, మామిడి విజయ్, మంచిర్యాల జిల్లా బీసీ కేయూపీఎస్ కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.





కళాశాలను తనిఖీ చేసిన డీఐఈఓ

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం డీఐఈఓ రవీంధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం తరగతి, పరీక్షల ఉత్తీర్ణత శాతం, రికార్డులను పరిశీలించారు. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ధనరాజ్, సూపరింటెండెంట్ మోసిన్, అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత, గణేష్, వినోద్, తిరుపతి, దశరథ్, కిషోర్, రూప, శివప్రసాద్, మల్లేష్, శంకర్, ప్రకాష్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇందన్పల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ యోహాన్ కోరారు. బుధవారం మండలంలోని దేవునిగూడెం గ్రామంలో బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవల గురించి ప్రజలకు, ఖాతాదారులకు అవగాహన కల్పించారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ శిరీష, సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాదితుల కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణానికి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ వ్యాపారి, మెకానిక్ రుద్ర రవి ఇటీవల మరణించిన నేపథ్యంలో బాదిత కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవి మంచివాడని, అందరితో కలిసిమెలిసి ఉండే వారని అకస్మాత్తుగా మరణించడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే అన్నారు. రవి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలుపుతున్నామన్నారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మైనారిటీ నాయకులు షేక్ చాంద్ ఉన్నారు.

ఉత్తమ ఫిలితాలు సాధించేలా కృషి చేయాలి



నవతెలంగాణ-జన్నారం

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫిలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యా శాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కలమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల హెచ్‌ఎం కట్ట రాజమౌళి, ఉపాధ్యా యులతో సమావేశం నిర్వహించారు. సమిష్టి కృషితో పదిలో మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-ఉట్నూర్



ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ టి.ప్రతాప్ సింగ్, అధ్యాపకులు విద్యార్థులు సంప్రదాయ వంటకాల రుచి చూశారు. ప్రపంచ ఆహార దినోత్సవం ప్రాధాన్యత గురించి అధ్యాపకులు మాట్లాడుతూ ఆహారం పరబ్రహ్మ స్వరూపమని, మనిషి ప్రవర్తన తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుందని, సరియైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల విద్యార్థుల మానసిక శారీరక పెరుగుదలపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు మితాహారం తీసుకోవాలని, ఆహారాన్ని వృథా చేయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి సాయి ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సింగ్‌రావు, లైబ్రేరియన్ చంద్రశేఖర్, అధ్యాపకులు ముజీబ్, రాజశేఖర్, డాక్టర్ రవీందర్, రాజశేఖర్, రాజ్ కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, కరుణాకర్, డాక్టర్ కిషన్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

విగ్రహా ఆవిష్కరణ కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని తాటిగూడ గ్రామంలో కుమురంభీం విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. తాటిగూడలో ఈ నెల 19న కుమురంభీం విగ్రహావిష్కరణ కార్యక్రమనికి ఎమ్మెల్యేలు, ఎంపీ, ప్రజాప్రతినిధులు హాజరు అవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పూర్క బాపురావు, మాజీ ఎంపీపీ పంద్రం జైవంత్‌రావు. జిల్లా సార్మేడి దుర్గు పటేల్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లోని షెడ్ల తొలగింపు

నవతెలంగాణ-బెజ్జూర్



మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లను బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారం, పోలీసులు తొలగించారు. బస్సు తిరగడానికి ఇబ్బందిగా ఉండడంతో పాటు కుమురం భీమ్ విగ్రహం చుట్టూ తాత్కాలికంగా షెడ్లను ఏర్పాటు చేసుకొని ఉండడంతో వాటిని తొలగించినట్లు కార్యదర్శి తెలిపారు. కుమురం భీం విగ్రహం చుట్టూ మళ్లీ షెడ్లను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో అందించే సేవలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత తెలిపారు. ప్రతీ మంగళవారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆపరేషన్ల కోసం ఎంపికైన వారిలో 18 మందిని బుధవారం తమ స్వంత ఖర్చులతో బెల్లంపల్లి లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా వేల మందికి ఈ శిబిరం ద్వారా కంటి ఆపరేషన్లు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య శిబిరం ఇన్‌ఛార్జి గోపితో పాటు కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను మార్చాలంటూ మంత్రికి వినతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కకు కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను మార్చాలంటూ డివైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ జిల్లాలో విద్య, వైద్య రంగాల్లో అనేక సమస్యలున్నాయని, వీటిని కలెక్టర్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయని, ప్రభుత్వ జూనియర్, డైట్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలన్నారు. రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాల యాజమాన్యం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వీటన్నింటిపై స్పందించాల్సిన కలెక్టర్ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. జిల్లాలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్‌పై సమావేశం



నవతెలంగాణ-నిర్మల్

పోలింగ్ స్టేషన్ రేషనలైజేషన్‌లో భాగంగా బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అభిలాష అభినవ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలోని పెంబి మండలంలో కొత్తగా 3 పోలింగ్ స్టేషన్‌లకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు తెలిపారు. అందులో భాగంగా రాంనగర్ మండల పరిషత్ పాఠశాల, బూరుగుపల్లి మండల పరిషత్ పాఠశాల, వాస్పల్లి మండల పరిషత్ పాఠశాలలున్నాయన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొరిపెల్లి శ్రావణ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గాజుల రవి కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సయ్యద్ హైదర్, వైఎస్ఆర్ సీపీ నాయకులు నరేష్ పాల్గొన్నారు.

కౌటాల ఏఈగా ప్రేమ్ కుమార్



నవతెలంగాణ-కౌటాల

కౌటాల విద్యుత్ శాఖ ఏఈగా వాంఖడే ప్రేమ్ కుమార్ ఫోర్‌మెన్‌గా నర్సింగ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఈగా పనిచేసిన రవీందర్ బదిలీపై తిర్యాణి మండలానికి వెళ్లగా ఆయన స్థానంలో ఆసిఫాబాద్‌లో పనిచేసిన ప్రేమ్ కుమార్ బదిలీపై కౌటాలకు వచ్చారు. గతంలో ఉన్న ఫోర్ మెన్ రమేష్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో రెబ్బెనలో పనిచేసిన నర్సింగరావు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా మండలానికి వచ్చిన ఏఈ, ఫోర్‌మెన్లను విద్యుత్ శాఖ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్‌పెక్టర్లు మాధవ్, ప్రవీణ్, లైన్మెన్ చరణ్దాస్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ బీసీలకు కేటాయించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీసీలకు కేటాయించాలని బీసీ సంఘం అధ్యక్షుడు నిమ్మ గణేష్, ప్రధాన కార్యదర్శి జి కిషన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాబోయే కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ కులానికి చెందిన వారికి కేటాయించాలని డిమాండ్ చేశారు. జనాభాలో 52 శాతం పైగా ఉన్న బీసీలకు కేటాయించాలన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఎన్నికలను బీసీలు ఐక్యమత్యంతో అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. గతంలో అవగాహన, ఐక్యమత్యం లేకపోవడం వల్లనే బీసీలు రాజకీయంగా ముందుకు రాలేక పోయామన్నారు. ఏ ఎన్నికలైనా బీసీ బిడ్డలు ఏకమై తమకు రావలసిన న్యాయమైనకోటాను పొందడానికి బీసీలకే మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ, నిర్మల్

పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పత్తి కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. నవంబర్ మొదటి వారంలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించనున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో లక్ష 47 వేల ఎకరాలలో పత్తి పంట సాగైందని, సుమారుగా 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పత్తి కొనుగోళ్ల ప్రారంభానికి ముందే జిన్నింగ్ మిల్లులలో అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలనీ ఆదేశించారు. సీసీఐ ద్వారా పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ.7521 నిర్ణయించడం జరిగిందన్నారు. రైతులు తాము పండించిన పత్తిని 8 శాతం తేమ మించకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధర పొందాలని కోరారు. పత్తి కొనుగోళ్లకు రైతుల ఆధార్ ప్రామాణికమని, రైతులందరు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ తో అనుసంధానం చేసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో 7 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పత్తి మిల్లులలో ముందస్తు తూకం యంత్రాల పని తీరును పరిశీలించుకోవాలని, అగ్ని ప్రమాధాలు జరుగకుండా అగ్ని మాపక శాఖ తనిఖీలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు.

వరి కొనుగోలుకే 272 కేంద్రాలు

అనంతరం వరి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. వరి ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 272 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దొడ్డు, సన్నరకం ధాన్యానికి వేరువేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే 20 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, గన్ని బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఈనెల 25 వరకు కొనుగోలు కేంద్రాలన్నింటినీ ప్రారంభించాలని ఆదేశించారు. అంతకు ముందు మార్కెటింగ్ శాఖ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీఎస్ఓ కిరణ్ కుమార్, డీఎం వేణుగోపాల్, సీసీఐ అధికారులు పాల్గొన్నారు.



అడ ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అడ, కుమురం భీమ్ ప్రాజెక్టులో రాష్ట్ర మంత్రి సీతక్క, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌తో కలిసి చేప పిల్లల విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. చేప పిల్లల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి సాంబశివరావు మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత సంవత్సరానికి 70 లక్షల చేప పిల్లల విడుదల కోసం ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టులో 90 వేల చేప పిల్లలు వదిలినట్లు పేర్కొన్నారు. మొత్తం 266 చిన్న చెరువులు, 11 పెద్ద చెరువులు, 4 ప్రాజెక్టులలో చేప పిల్లలు వదిలిపెట్టనున్నట్లు వివరించారు. అనంతరం మంత్రి వట్టివాగు ప్రాజెక్టుకు నిర్మించ తలపెట్టిన బండుకు శంకుస్థాపన చేసి గోలేటికి వెళ్లారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేసుల వివరాలు త్వరితగతిన నమోదు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఉన్న అండర్ ట్రయల్ కేసులకు సంబంధించి జిల్లా జడ్జీ ఎంవీ.రమేష్ అధ్యక్షతన కోర్టులోని తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, అదనపు కలెక్టర్ దాసరి వేణు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జీ మాట్లాడుతూ అండర్ ట్రయల్ కేసులకు సంబంధించి కక్షిదారుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసుల సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. చార్జి షీట్ వేసిన వేయని కేసులకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. బెయిల్ మంజూరు అయిన వెంటనే నిర్ణీత నిబంధనలు పాటిస్తూ వారిని విడుదల చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు అండర్ ట్రయల్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిసిఆర్బి క్రైమ్ ఇన్స్‌పెక్టర్ కేశవ్, జైలర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల శాంతియుత ర్యాలీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు డిగ్రీ, జూనియర్ కళాశాలలకు రావాల్సిన స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ప్రయివేటు కళాశాల యజమాన్యాల ఆధ్వర్యంలో విద్యార్థులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యజమాన్యల ప్రతినిధులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యాల ప్రతినిధులు సాయిని రాజశేఖర్, ప్రసాద్, బాలాజీ, లింగమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.



అర్ధ శతాబ్ది స్వర్ణోత్సవ సభ విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పీడీఎస్‌యూ అర్థ శతాబ్ది స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో అర్థ శతాబ్ది సర్వోత్సవాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 50 సంవత్సరాలలో విద్యార్థుల సమస్యలపై పోరాటం చేసి ఎన్నో విజయాలు సాధించామన్నారు. ఎంతోమంది సంఘం అభివృద్ధి కోసం త్యాగాలు చేశారని, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే సర్వోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు విలాస్, హరిశ్చంద్ర ప్రసాద్, అరుణ్, సుధీర్, సాయి, వంశీ, కార్తీక్, నాగరాజు, అజయ్, ప్రతిభ, సమీనా, రమ, యోగిత, మరి, మనిషా, రాగిణి, కళ్యాణి, పూజిత, స్వరూప, విద్యార్థులు పాల్గొన్నారు.

పేపర్ రవాణాకు బందోబస్తు కల్పించాలి

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లుకు చెందిన పేపర్ రవాణాను స్థానిక లారీ అసోషియేషన్ నిర్వాహకులు అడ్డుకోవడంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని మిల్లు యాజమాన్య ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో బుధవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత 20 రోజులుగా మిల్లు యాజమాన్యానికి, స్థానిక లారీ అసోషియేషన్‌కు మధ్య వివాదం కొనసాగుతున్న విషయం తెల్సిందే. దీనితో పేపర్ లోడ్‌తో ఉన్న 33 లారీలను గత 20 రోజులుగా కాగజ్‌నగర్‌లోనే నిలిపి ఉన్నాయి. దీనితో తమకు తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని మిల్లు యాజమాన్య ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. దీనితో హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మిల్లు చీఫ్ మేనేజర్ (హెచ్ఆర్) రమేష్‌రావును సంప్రదించగా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందనీ, ఉత్తర్వుల కాపీ అందగానే దానిని పోలీసు శాఖకు అందించి వారు కల్పించే బందోబస్తు మధ్య పేపర్ రవాణా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌తో ప్రయోగపూర్వక జ్ఞానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు ప్రయోగపూర్వక జ్ఞానం వస్తుందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. పాఠశాలలో ఒకేషనల్ చదువుతున్న విద్యార్థులు 10 రోజుల పాటు జిల్లా కేంద్రంలో శిక్షణ తీసుకొని సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేసిన ప్రయోగపూర్వక శిక్షణ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చదివిన విషయ జ్ఞానం కంటే అనుభవ పూర్వక జ్ఞానం ఎక్కువ కాలం గుర్తుంటుందన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పూర్తి కావడానికి కృషి చేసిన శిక్షకులు రాజు, రాజ సులోచనలను అభినందించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2025-26 విద్యాసంవత్సరంలో 9 మరియు 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి ఈ నెలాఖరు వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాలయం వెబ్‌సైట్లు సీబీఎస్ఈఐటీఎంఎస్.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

బెజ్జూర్ ఏఓగా నాగరాజ్ బానోత్



నవతెలంగాణ-బెజ్జూర్

మండల అగ్రికల్చర్ అధికారిగా నాగరాజు బానోత్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం నూతన వ్యవసాయ అధికారులను నియమించడంతో ఈ మేరకు బాధ్యతలను స్వీకరించారు. తొలుత ఆయన డీఏఓ రావురి శ్రీనివాస్‌కు రిపోర్టు చేసినంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు.

ప్రమాదవశాత్తు వాగులో ట్రాక్టర్ బోల్తా

- 30 క్వింటళ్ల సోయా పంట నీటిపాలు



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రం నుండి వ్యవసాయ చేనులో కి వెళ్లే ఖర్బాల దారిలో వాగులో ప్రమాదవశాత్తు బుధవారం ట్రాక్టర్ బోల్తాపడింది. మండల కేంద్రానికి చెందిన సాయినాథ్ అనే రైతు తన చేనులో పండించిన 30 క్వింటళ్ల సోయా పంటను ట్రాక్టర్‌లో ఇంటికి తరలిస్తున్నాడు. మార్గ మధ్యలో ఖర్బాల వాగుపై వంతెన లేకపోవడంతో సోయా సంచులతో ఉన్న ట్రాక్టర్ ట్రాలీ వాగులో బోల్తా పడింది. ఆరుకాలం పండించిన పంట నీళ్ల పాలు కావడంతో రైతు కన్నీరు మున్నీరు అయ్యాడు. వెంటనే జేసీబీ తెప్పించి వాగులోంచి ట్రాక్టర్‌ను బయటకు తీయించారు. ప్రతిసారి వాగులో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రభుత్వం స్పందించి వాగుపై వంతెన నిర్మించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

గుండేగావ్ గ్రామ ప్రజలకు తక్షణమే పునరావాసం కల్పించాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

గుండె గావ్ గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గుండేగావ్ గ్రామ ప్రజలకు తక్షణమే పునరావాసం కల్పించాలి లేదా ఇందిరమ్మ ఇండ్లను మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు ముంపు బాధితులను ఆదుకొని 470 కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు. విద్యావంతులైన గుండేగావ్ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణ మాఫీ అమలు చేయాలన్నారు.